ముఖం.

చావు భయంతో చెప్పాడు లతీఫ్.

"మాకు మాల్ అందిస్తోంది దేవీప్రసాద్. నేను ట్విన్‌సిటీస్ ఏరియాకు డిస్ట్రిబ్యూటర్‌గా పని చేస్తున్నాను. సౌత్ ఇండియాలో ఇంకా నాలాంటి వాళ్ళు అనేక మంది వున్నారు."

"దేవీ ప్రసాద్ స్థావరం ఎక్కడ?"

అడిగిన ప్రతి ప్రశ్నకూ ప్రాణభయంతో సమాధానం చెప్పసాగాడు లతీఫ్. బండ మైసమ్మ గుడివెనుక ఉందో పెద్ద మోటార్ మెకానిక్ షెడ్.

పైకి మెకానిక్ షాపులా కనపడుతున్న దాంట్లో భారీ ఎత్తున మాదక ద్రవ్యాలు దాస్తాడు దేవీ ప్రసాద్."

ఇన్‌ఫర్‌మేషన్ అందించిన లతీఫ్‌ను కట్టిపడేసి అప్పటి కప్పుడు బండమైసమ్మ గుడివైపు పరుగు తీశారు. బిగ్‌బెన్ డిసౌజా. దారి మధ్యలో టాస్క్ ఫోర్స్ మనుషులకు వైర్లెస్ మేసేజ్ కూడా అందచేశారు.

అర్ధరాత్రి జరిగిన రెయిడ్‌లో పాతిక కిలోల బ్రౌన్ షుగర్ బయట పడింది. మార్కెట్‌లో దాని వెల కనీసం కిలో కోటి రూపాయలు పలుకుతుంది. అంటే మొత్తం పాతిక కోట్లు. అండర్ వరల్డ్ డాగ్‌గా ప్రారంభించిన తర్వాత దేవీ ప్రసాద్‌కు అంత పెద్ద నష్టం జరగడం అదే మొదటిసారి. మత్తు పదార్థాలతో పాటు అతి ముఖ్యమైన అనుచరులు కూడా జైలు పాలయ్యారు. అయితే రెయిడ్ జరిగిన ప్రదేశం దేవీ ప్రసాద్‌ది కాకపోవడం ఆ సమయంలో అతడక్కడ లేకపోవడం. అతడికి వ్యతిరేకంగా సాక్ష్యం ఉండకపోవడంతో అతడు శిక్ష తప్పించుకోగలిగాడు.

ఆ సంఘటనతో బిగ్‌బెన్ సీనియర్ ఇన్వెస్టిగేటివ్‌గానూ, డిసౌజా ఫస్ట్ ఏజెంట్‌గానూ ప్రమోట్ అయ్యారు. తర్వాత మూడు నెలలకు డిసౌజాకు బిగ్‌బెన్ చెల్లెలు మోనికాకు చర్చిలో పెళ్ళి జరిగింది. వాళ్ళ ఫస్ట్ నైట్ రోజున జరిగిందో ఘోర సంఘటన.

డిసౌజా మోనికా మొదటి అనుభవాన్ని చవి చూస్తున్న సమయంలో వాళ్ళ మీద ఎటాక్ జరిగింది. దేవీ ప్రసాద్ మనుషులు చేసిన దాడిని డిసౌజా తిప్పి కొట్టడానికి తన శాయశక్తులా ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో దేవీ ప్రసాద్ అనుచరుడు ఒకడు మరణించాడు. పోలీసులు వచ్చే సమయానికి మోనికా శవం బెడ్ మీద పడివుంది.

విచారణ జరిగింది.

డిసౌజా చేతిలో చచ్చిపోయిన రౌడీ షీటర్‌కు, మోనికాకు లైంగిక సంబంధం ఉందనీ, చెల్లెలి తిరుగుళ్ళకు కళ్ళెం వేయాలనే ఉద్దేశ్యంతో బిగ్‌బెన్ ఆమెకు పెళ్ళి చేశాడనీ, శోభనం రోజున మోనికా రౌడీ షీటర్‌తో లేచిపోవడానికి పథకం వేసిందనీ, ఆ పథకాన్ని గ్రహించిన బావమరుదులిద్దరూ కలిసి మోనికాను రౌడీ షీటర్ని చంపిపారేశారనీ పోలీసులు కేసు పెట్టారు. సాక్ష్యాలు సృష్టింపబడ్డాయి. చెల్లెల్ని పోగొట్టుకున్న బిగ్‌బెన్, భార్యను పోగొట్టుకున్న డిసౌజాలకి ఏడేళ్ళ జైలు శిక్ష పడింది. మరి కొద్ది రోజుల్లో వాళ్ళకు శిక్ష పూర్తవుతుంది.

★★ ★★ ★★ ★★

పూర్తిగా విన్న తర్వాత రాంనాథ్ కొద్ది క్షణాల సేపు మాట్లాడలేకపోయాడు. తర్వాత ఒక నిశ్చయానికి వచ్చినవాడిలా అన్నాడు.

"మన ముగ్గురికీ పరిస్థితి దాదాపు ఒకే రకంగా వుంది. మన ముగ్గురి విషయాల్లోనూ వాడు ఒకే రకమైన పథకాలు సృష్టించాడు. వాడ్ని ఊర్కే వదలకూడదు."

రెండు క్షణాలు 'పాజ్' తర్వాత చెప్పాడు.

"దేవీ ప్రసాద్‌ని చంపాలి. వాడిని చంపి తీరాలి..."

సరీగ్గా ఆ సమయంలో 'మిలాఖత్' రూపంలో సెంట్రీ డ్యూటీ చేసే మనిషి వాళ్ళ దగ్గరికి వచ్చాడు. రాంనాథ్ వంక చూస్తూ చెప్పాడు.

"మీకోసం ఎవరో ఇద్దరు మనుషులు వచ్చారు. విజిటింగ్ రూంలో కూర్చుని వున్నారు. వాళ్ళు మీతో అర్జంటుగా ఏదో మాట్లాడాలిట.

ఆ మాటతో రాంనాథ్ కు ఆశ్చర్యం వేసింది.

డిసౌజా. బిగ్‌బెన్‌లు వెళ్ళమన్నట్లు తల ఊపారు.

రెండు నిముషాల్లో 'మిలాఖత్' గది దగ్గరకు చేరుకున్నాడు రాంనాథ్. అక్కడ కూర్చుని ఉన్న వాళ్ళను చూడగానే అతడి భృకుటి ముడిపడింది.

వాళ్ళలో ఒకడు మణిశంకర్.

మరొకడు సర్దార్.

(ఇంకావుంది)

## 'పేరు'

ఆఫీసు కాంప్ మీద ఊరెళ్ళి ఒక లాడ్జిలో దిగాను.

నేను వచ్చానని తెలిపి, నన్ను కలుసుకోవాలని, మిత్రుడు మూర్తి వచ్చాడు.

చాలా సేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాము.

మాటల మధ్యలో ఎటో చూస్తూ "లాడ్జి పేరు" పోయిందిరా అన్నాడు ఒక్కసారిగా.

వాడంటున్న మాటలేమిటో ఒక క్షణము అర్థం కాలేదు నాకు.

ఈ ఊళ్ళో ఈ లాడ్జికి ఎంతో మంచి పేరు ఉందని విన్నాను.

అందుకే కదా, కాంప్‌కి వచ్చినపుడల్లా స్టేషన్‌కు దూరమయినా, ఈ లాడ్జ్‌కి వస్తాను.

మరి అలాంటిది 'వీడిలా అంటున్నాడేమిటి' ఇలా అనుకునే,

"ఏమిటిరా!. నవ్వుంటున్నది" అన్నాను ఆశ్చర్యంగా.

"అవునురా. అటు చూడు" అంటూ



చూపుడు వ్రేలుతో ముందుకు చూపాడు.

అక్కడ 'స్వప్నలాడ్జి" అని పెయింటింగ్‌తో వ్రాసి వున్న అక్షరాలు చెరిగిపోయి ఉన్నాయి.

అప్పుడర్థమయ్యింది వాడే ఉద్దేశ్యంతో ఈ మాటలు అన్నాడో.

నేను మరోలా అర్థం చేసుకోవడంతో, ఆశ్చర్యంతో కూడిన నవ్వు రాకమానలేదు నాకు.

— అడబాల సూర్యనారాయణ, తుని